కథ

అనంతం

— కె. గీత

మం(దంగా శబ్దం చేస్తూ నీట్‌గా వున్న రోడ్డు మీద సాఫీగా సాగిపోతూంది మా మోటార్ సైకిల్. శేఖర్ భుజమ్మీద తలవాల్చి రోడ్డు నించి దూరంగా, విశాలంగా పర్చుకుని అటుకొండలని ఒరుసుకుంటూ నెమ్మదిగా (పవహిస్తూన్న గోదావరిని చూస్తున్న నేను శేఖర్‌ని తట్టి అన్నాను.

'ఇక్కడ కాస్సేపాగుదాం'

ఏదో ఆలోచనల్లో వున్న శేఖర్ సడెన్ (బేక్ వేసే సరికి, బేలన్స్‌డ్‌గా కూర్చొని నేను ముందుకు తూలిపడబోయి దాదాపు నేలదగ్గరికి చేతులు గాల్లో ఆన్చుకుని నిలదొక్కు కున్నాను.

'ఏంటంత సీరియస్‌నెస్?' నాసలు చిట్లించి అడిగాను.

'ఊ...లేదు. ఏం లేదు... ఆగుదాం' అంటూ వెహికిల్ రోడ్ (పక్కకి తీసి ఆపి 'పదో' అన్నాడు.

చుట్టూ ఎంతోమంది జనం ఉన్నారు. అక్కడికి కాస్త దూరంలోనే ఏదో ఊరు, ఇంకాస్త దగ్గరలో నర్సరీ వున్నాయి. దూరంగా నర్సరీ గేట్లో నుండి రంగు రంగుల పువ్వులు. దాదాపు నర్సరీ నించి రోడ్డు కివతల గోదారి ఒడ్డు దాకా ఏవో చిల్లర కొట్లు వున్నాయి.



అక్కడ గోదావరి ఒడ్డున చాలా నీట్‌గా వుంచారు. కొంతదూరం వరకూ కంచెలా వేసి చిన్న సైజు బీచ్‌లా వుంది. కారం అటుకులు అమ్మేవాళ్ళు అతి హడావిడిగా తిరుగుతున్నారు.

ఒక్కసారిగా ఎంతో చిన్న పిల్లనైపోయినట్టనిపించింది నాకు.

'శేఖర్! రా... ఇసకతో చిన్న గుడి కట్టుకుందామా?' గారాబంగా అడిగాను.

రెండేళ్ళ మా గాఢ స్నేహాన్ని ఫలితంగా మా పెద్దలు ఆర్నెల్ల (కితం మా వివాహం నిశ్చయం చేసినా, శేఖర్ మేనత్త కొడుకే కావడంతో చిన్నప్పట్నించి పేరు పెట్టి పిలిచే అలవాటు మా అమ్మమ్మ తిట్టి పోస్తున్నా తగ్గలేదు నాకు.

నా మానాన నేను ఆసకలోకి కాలుముంచి గుడి కడుతున్న నేను నా చుట్టూ మనుషులున్నారన్న ధ్యాసే మర్చి పోయాను.

చిన్నప్పుడు ఎంతో సరదాగా పట్టుపదలని వి(కమార్కుల్లా ఎన్నిసార్లు విరిగి పోతున్నా మళ్ళీ మళ్ళీ ఇసకల్లో గూళ్ళు కడుతూనే వుండే వాళ్ళం. ఎంతెంత ఎత్తు గూళ్ళనీ!!

రెండు నిమిషాల్లోనే విసిగెత్తి పోయిన నేను తలెత్తి చూసే సరికి శేఖర్ కాస్త దూరంగా ఓ చిన్న ఇసకదిబ్బ మీద కూర్చొని ఇటే చూస్తున్నాడు. నాకు ఒక్కసారిగా సిగ్గనిపించి, తలకాస్త కిందికి వంచుకొని, పెంకిగా కాళ్ళు టపటప లాడిస్తూ వెళ్ళి పక్కన చతికిల బడ్డాను.

అప్పుడే నెమ్మదిగా పడమటికి దిగుతున్నాడు సూర్యుడు. ఎదురుగా గోదార్లో సూర్యుణ్ణి కరిగించి రోడ్డేసినట్టు పెద్ద చార. ఒక్కసారిగా అప్పటి వరకూ వున్న అల్లరి అంతా మాయమై పోయింది నా మనసులోంచి, చూస్తున్న కొలదీ అంతులేనిదేదో మనసును కదుపుతూన్నట్టనిపిస్తూంది. అ(పయత్నంగా శేఖర్ భుజమ్మీద తలవాల్చి మొహంలోకి చూసాను. ఆ మా(తం సాయం కొసమె తనూ చూస్తున్నట్టు నా నడుం చుట్టూ చెయ్యివేసి తన తలని (పక్కకి వంచేడు. మా ముందు దిగువలో ఒడ్డున మెల్లగా, వేళ్ళే కొలదీ మధ్యన వేగంగా కదిలి పోతూంది గోదావరి.

'రేఖా!' పిలిచేడు కొత్తగా శేఖర్.

నాకెందుకో ఆ గొంతులో అంతవరకూ తనదే అయిన (పపంచంలో ఏదో కొత్తగా గోచరించినపుడు ఆశ్చర్యారాధనతో హత్తుకున్నట్టు అన్పించింది.

'ఊ...' కళ్ళు కదపకుండానే అన్నాను.

'ఈ గోదావరిని చూస్తూంటే ఏమనిపిస్తూంది?'

'... ...'

'అనంతమైన మనుషుల జీవనవేదన గుర్తుకు రావడం లేదూ!'

వింతధోరణికి ఎందుకో ఆశ్చర్యం రాలేదు నా ముఖం లోకి.

అ(పయత్నంగా తలూపాను.

నన్నింకా దగ్గరికి హత్తుకొని మళ్ళీ తనే అన్నాడు.

'మనిద్దరం పెళ్ళి చేసుకోబోతూన్నాం కదూ. నిజంగానే మనిద్దరం (పేమించుకున్నాం. (పేమించాం. మనిద్దరం కల్సి ఎన్నిటినో (పేమించాం. లెక్కలేకుండా. ఈ సంధ్య చీకట్లనీ అల్లరి నవ్వుల్నీ... కదూ!'

...అంతబిగి కౌగిలిలో వి(తంగా ఆవేశం కలగలేదు నాకు. ఏదో (పశాంతత ముట్టుకున్నట్టనిపించి కళ్ళు మూసుకున్నాను. కాస్త ఆగి గొంతు మెల్లగా సవరించు కున్నాడు

'రేఖా! మై డాలింగ్! ఈ అనంతమైన (పపంచంలో మనిద్దరం, రెండు చిన్ని మనసులం కూడాబలుక్కుని జీవితం గడపబోతున్నాం. మన బంగారు భవిష్యత్తులో మనకి బుల్లి బుల్లి పిల్లలు పుడతారు. ఆనందంగా మనం పిల్లల్ని అక్కున చేర్చుకుంటాం. మనవల్ని, ముని మనవల్ని చూడాలనే అత్యాశతో ఇద్దరిలో ఎవ్వరూ ముందుగా ఒకర్ని వదిలి వెళ్ళిపో కూడదు. అందుకని, పిల్లలకి పెళ్ళి చేసెయ్యగానే ఇద్దరం కల్సి 'వచ్చిపోదాం'.

అనుకోకుండానే నా కుడిచెయ్యి తన నోటికడ్డంగా వెళ్ళింది. ఆ సంధ్య వెలుగులో ఖాళీ అయిపోతున్న గోదావరి ఒడ్డున నా కళ్ళలో నీటి తెమ్మెర కదిలిందనుకుంటాను. ఒళ్ళోకి నన్ను సుతారంగా లాక్కుని మ్యూసుకున్న నా కనురెప్పల మీద చిన్నగా పెదవులాన్చాడు. నా కెందుకో వింతగా లేదు. నేనింకా స్తబ్దంగా వుండి పోవడంతో వంగి నా చెవుల్లో గుసగుస లాడ్తున్నట్టు మెల్లగా, స్ఫుటంగా మాట్లాడసాగాడు.

'రేఖా! బహుశః నీకు నేను, నాకు నువ్వు ఎప్పటికీ విడిపోమని (పమాణాలు చేసుకుంటామనుకుంటూ పెళ్ళిలో, రేఖా! నువ్వు నాకెంతో అపురూపం. నా (పాణం పోయినా సరే నేను నిన్నెప్పుడూ కష్టపెట్టను.'

నుదుటిమీది నించి కళ్ళు మూసేస్తున్న ముంగురుల్ని వెనక్కి మెల్లగా నెట్టుతూ ఆప్యాయంగా మాట్లాడుతున్నాడు శేఖర్.

కానీ నా కెందుకో ఆవేదన కన్పిస్తూంది స్వరంలో.

'నువ్వు నాకు పువ్వులతో సమానంగా కన్పిస్తావు. నిజంగా ఐ లవ్ యూ డాలింగ్. నా ధోరణి నీకు విచి(తంగా వుంది కదూ. అయినా నువ్వు తెలుసుకోవాలి మరి. అందుకే తప్పటం లేదు. నువ్వు కూడా నన్నెంత ఇష్టపడ్డావో తెలుసునాకు. మీ అమ్మా, నాన్నా మాకు పొలాలు, సొంత ఇల్లు, వ్యాపారం అన్నీ వున్నాయి. ఫర్వాలేదులే. అని నీ ఇష్టాన్ని మన్నించి నిశ్చయించేసారు.'

'నా వానాకాలం డి(గీకి ఉద్యోగం రాదని తెల్సు నీకు. చేస్తే వ్యాపారమేదైనా చెయ్యాలి. నెల రోజుల్నించి నీకీ విషయం చెప్పే వీలులేక మధనపడ్తున్నాను. మాకు వ్యాపారంలో ఉన్నటుంటండి విపరీతమైన నష్టం వచ్చింది. ఇల్లూ, పొలంతోసహా జప్తుకి వెళ్ళిపోయింది. నిజానికి మేం నల్గురం అన్నదమ్ములమైనా నేనింకపూర్తిగా నాన్నగారికి సాయం చేస్తున్నాను. ఉన్నట్టుండి అగమ్య గోచరమైంది నా పాతికేళ్ళ జీవితం. నాన్నగారి సంగతి చెప్పనే అవసరం లేదు. నష్టాల్నించి కోలుకోవడానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు పడ్తుందో తెలీదు. గుడ్డిలో మెల్ల. ఆడపిల్లలు లేరు కాబట్టి పెళ్ళి బాధ్యతలు లేవు.

నిజమే. నేను నిన్ను మనస్ఫూర్తిగా ఇష్టపడ్తున్నాను. కానీ నిన్ను చూడగలనని చెప్పినంత అపురూపంగా చూడగలనో, లేనో... నా మీద నాకే అపనమ్మకం.'

నెమ్మదిగా వెన్నెలపైకి వస్తూంది. చల్లగాలి రివ్వున వీస్తూంది. అంత చల్లోనూ చెమట పట్టింది నాకు. కానీ తట్టుకోలేనివి వింటున్నా నేను ఇంకా కాస్తో కూస్తో చెక్కుచెదరని స్తబ్దతలోనే వున్నానంటే కారణం శేఖర్ చేతుల మధ్య వుండడమేననుకుంటాను. నేను మొదట్నించీ శేఖర్‌ని అందుకే ఎక్కువ ఇష్టపడ్డాను. మామూలు అల్లరి చిల్లరిగా, ఆలోచన్లు లేకుండా పన్లు చేసే ఇప్పటి కు(రకారు లాంటి వాడు కాదు శేఖర్. ఏ పనిచేసినా ఎంతో బాధ్యతగా ఆచి, తూచి చూసే శేఖర్ అంటే నాకొక విధమైన గౌరవం కూడా.

నా మౌనాన్ని మరోవిధంగా అర్థం చేసుకొని ఇంకా నా జుట్టు నిమురుతూ, నన్ను చంటి పిల్లలా మరింత దగ్గరకు లాక్కుని అన్నాడు శేఖర్. 'వ్యాపారం చేసే తం(డికి కొడుకుగా ఇప్పటికే కొద్దో గొప్పో కష్టనష్టాలు చూసినందు వల్లేమో. నా కింకా మతిచలించలేదు. ఈ చీకట్లోకి చూస్తూంటే ఇంక (పపంచం ఈ రా(తికి అంతమై పోతే బావుండుననిపిస్తూంది'

నేను నిరామయంగా చూస్తున్నాను శేఖర్‌వైపు. (పవాహంలో నీళ్ళు మెల్లగా చప్పుడు చేస్తూ కదులుతున్నాయి. అనుకోకుండా నిశ్శబ్దం మా మధ్య చోటు చేసుకుంది.

మౌనంగా గోదావరి వంక చూస్తూన్న శేఖర్ చేతిని నా చేతుల్లోకి తీసుకుని నెమ్మదిగా పిలిచాను. నాకు మరీ మనస్ఫూర్తిగా ఇష్టం బయటికొచ్చినపుడు మా(తమే పిలుస్తానిలా. ఆ క్షణాన నాకు సానుభూతి, జాలి కలగలేదు. మరింత ఆప్యాయత అట్టడుగు వించి కదిలి వచ్చింది.

'శక్కూ...!' అన్నాను మరింత గట్టిగా చేతిలో చెయ్యిని బిగించి.

'అధైర్యపడకు'. అన్నానేగానీ నాకూ గడ్డ కట్టుకుపోయిన అ(పశాంతంగానే వుంది. నిజంగా మనుషులకి వయసుతో నిమిత్తం లేకుండా జీవితం పట్ల తీ(వాలోచన పరిస్థితులే కల్పిస్తాయనుకుంటా. గంట(కితం వరకూ కేవలం అల్లరి రేఖగానే వున్న నాకు, ఈ క్షణంలో ఈ ధోరణిలో ఎదిగిన నాకు ఎంతో అంతరముందనుకుంటాను.

ఎంతసేపు కూర్చున్నామో తెలీదు. ఇంకా వెన్నెల అలానే వుంది. గాలిలో మరించ చలి ఎక్కువైంది. గోదావరి మా(తం లోకంలో పచ్చినిజాల్లా నిశ్చలంగా (పవహిస్తూనే వుంది నెమ్మదిగా.

ఏ గమ్యమో తెలీని మేమిద్దరం మెల్లగా లేచాం. ఇదివరకు ఎన్నిసార్లు హత్తుకుని నడిచినా ఇలా అన్పించలేదు నాకు.

శేఖర్ తన (ఫెండునడిగి తెచ్చిన మోటార్ సైకిల్ మం(దంగా శబ్దం చేస్తూనే వుంది. రోడ్డుకు దూరంగా గోదావరి అనంతానికి కదిలి వెడుతూనే వుంది మా మనసుల్లా.